తుర్కయంజాల్ మున్సిపాలిటీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర శివారు తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు దక్కింది. గురువారం ఢిల్లీలో ఈ అవార్డును మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అందుకున్నారు. 2021 నుంచి 2024 వరకు స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మున్సిపాలిటీలకు సీఎస్ఈ, ఎంఓహెచ్‌యూఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డు ను అందజేసింది. గురువారం ఢిల్లీలోని సిల్వర్ హోక్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేం జ్ మేకర్స్ కార్యక్రమంలో సీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ సునీతనరైన్ చేతుల మీదుగా కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ హరీష్ అవార్డును అందుకున్నారు. మున్సిపాలిటీకి అవార్డు దక్కడం పట్ల కమిషనర్ ఆనందం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కొత్తపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఎస్ఆర్ఎల్ కాలనీ, నాగేశ్వర్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ఎల్‌కాలనీ రోడ్ నంబరు 3నుంచి పార్కు వరకు, షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంతం నుంచి కొత్తపేట - నాగోల్ ప్రధాన రహదారి వరకు సుమారు రెండు వందల మీటర్ల మేర అర్ధాంతరంగా ఆగిన బాక్స్‌డ్రెయిన్ పనులను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ నవీన్‌కుమార్, ఏఈ మాత్యనాయక్, పారిశుధ్య విభాగం డీఈ చందన, కాలనీల ప్రతినిధులు సుధాకర్, జంగయ్య, లక్ష్మీరాజం, రవి, రాకేష్‌యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి : కార్పొరేటర్

వనస్థలిపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాలనీలోని రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎస్కేడినగర్, వైదేహినగర్ కాలనీల్లో రోడ్లు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో కార్పొరేటర్ గురువారం కాలనీ రోడ్లను పరిశీలించి త్వరితగతిన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించకపోతే చర్యలు

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి


కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

చంపాపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని లేనిచో తగిన చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం గోవర్ధన్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని పలువురు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గోవర్ధన్‌రెడ్డి మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, ఇన్‌చార్జి హెచ్ఎం భూషణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. పాఠశాలలో రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా ఉండాలని, కోడిగుడ్లు ఉడికించిన అరగంటలోపే విద్యార్థులకు అందించాలన్నారు.

రేపు మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఓల్డ్‌మలకపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఈనెల 21న ప్రమాణస్వీకారం చేయనుంది. చైర్మన్ చెకోలేకర్ లక్ష్మితో పాటు 17మంది పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. మలకపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో(గంజ్) ప్రమాణ స్వీకారం ఉంటుంది. ముఖ్య అతిథులుగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు.



టీటీఐ ఆవరణలో ఏఆర్ కానిస్టేబుళ్లకు శిక్షణ

టీటీఐలో కానిస్టేబుళ్లకు శిక్షణ

కొత్తపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్‌లో ఎంపికైన 61మంది ఏఆర్ పోలీస్ కానిస్టేబుళ్లకు సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఎల్బీనగర్ అల్కాపురి చౌరస్తా సమీపంలో గల ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ)లో ట్రాఫిక్ విధులపై శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్, ఎస్‌పీఓ అల్లూరయ్య, ఎస్ఐ మనోహర్ లెక్చర్ హాల్‌లో కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన విధులు, ఎంవీ యాక్టులో విశేషాలను, వర్టికల్స్ ప్రాధాన్యతనూ వివరించారు. ట్రాఫిక్ సిగ్నళ్లు లేని/ పనిచేయని వేళ ఆయా ప్రాంతాల్లో చేపట్టే ట్రాఫిక్ నియంత్రణ చేతుల ద్వారా సంజ్ఞలను టీటీఐ ఆవరణలో పరిచయం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్ రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి : ఉప్పల

మన్సూరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న అభాగ్యులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. మేడిపల్లికి చెందిన అనసూయ మహాజన్ అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రిలో చికిత్సపొంది సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయగా మంజూరైన నిధులకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాన్ని గురువారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అనసూయ కుమారుడికి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, చికోటి సంపత్, జిల్లా వంశీ పాల్గొన్నారు.


పేదింటి అమ్మాయి పెళ్లికి సాయం

నాగోల్‌లో నివాసముండే దళిత సామాజిక వర్గానికి చెందిన మిరియాల లక్ష్మమ్మ, అంజయ్య దంపతుల కుమార్తె లక్ష్మీపావని(అన్నపూర్ణ)కి వివాహం నిశ్చయమైంది. కాగా వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌గుప్తా గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఉప్పల ఫౌండేషన్ ద్వారా యువతి వివాహానికి పుస్తెమెట్టెలు, చీరగాజులు అందజేశారు.

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సైనిక్‌పురిలోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ పర్యటించనున్న సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు కుషాయిగూడ, మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని తెలిపారు. ఆయారూట్లలో ప్రయాణించే వాహనదారులు ఈ ఆంక్షలను గుర్తించి ప్రత్యామ్నాయమార్గాల్లో ప్రయాణించి, రద్దీని నివారించాలని కోరారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌ను నియమించండి



మాట్లాడుతున్న జగన్మోహన్‌శర్మ, శ్రీనివాస్ తదితరులు

ఎల్బీనగర్ : తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆర్‌కేపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిషత్‌కు పాలకవర్గం లేక సంవత్సరకాలంగా రాజులేని రాజ్యంగా తయారైందన్నారు. దీంతో విదేశాలలో చదువుతున్న విద్యార్థులకు సంవత్సరకాలంగా స్కాలర్‌షిప్పులు విడుదల కాకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నా రు. బ్రాహ్మణ పరిషత్ కార్యాచరణను సాఫీగా నడిపించేందుకు ఐఏఎస్ అధికారిని చైర్మన్‌గా నియమించాలని కోరారు. సమాఖ్య ప్రతినిధులు మునిపల్లె శ్రీనివాస్, భాస్కరమూర్తి, నమిలికొండ కిరణ్‌కుమార్, రఘునందన్ పాల్గొన్నారు.

అమిత్‌షాపై ఆగ్రహం

- అంబేడ్కర్ వ్యాఖ్యలను ఖండిస్తూ నేతల నిరసనలు

మన్సూరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు చాలా అవమానకరమని రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశంలో అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం రింగురోడ్డు వద్ద చేపట్టిన కార్యక్రమంలో మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజీగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌లతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు రక్షణ కవచంలా ఉన్న రాజ్యాంగాన్ని తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు యావత్ భారత దేశం ఏకం కావాలన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పన్యాల జైపాల్‌రెడ్డి, గణేష్‌నాయక్, బుడ్డ సత్యనారాయణ, బండ సురేందర్‌రెడ్డి. మల్లారపు శాలిని, తులసీ శ్రీనివాస్‌గౌడ్, కల్లెం సుజాతరెడ్డి, అరుణ, మక్సూద్, గుర్రం శ్యామ్‌చరణ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, ఇరిగి రమేష్, మతిన్ షరీఫ్, జోగి రాములు, రాజశేఖర్, అరుణ్, శరత్‌రెడ్డి, జేబీగౌడ్ పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు


అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, చిత్రంలో మిద్దెల, దరిపల్లి, జక్కిడి, ముద్దగౌని తదితరులు

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి : కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ గురువారం డీఎస్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతలు నిరసన చేపట్టారు. మోదీ, అమిత్‌షాలు దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్మగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నజీర్, శేఖర్, సుకుమార్, దినేష్ పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లు వారధిలా ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థకు వారధిలా ఉండాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన పారా లీగల్ వలంటీర్లకు శిక్షణాశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు గౌరవంతో జీవించే హక్కు, రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా అన్ని హక్కులతో పాటు విధులు, బాధ్యతలను నిర్వర్తించేలా అవగాహన కల్పించాలన్నారు. వలంటీర్లు వివాదాలు, సమస్యలు, సమస్యల స్వభావాన్ని గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు మాట్లాడుతూ వలంటీర్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నుండి సరైన అధికారంతో జైళ్లు, లాక్ అప్, సైక్రియాట్రిక్ ఆస్పత్రి, చిల్డ్రన్స్ హోం, అబ్జర్వేషన్‌హోంలను సందర్శించాలని ఖైదీల న్యాయ సేవా అవసరాలను చూడాలన్నారు. పారాలీగల్ వలంటీర్లు చట్ట ఉల్లంఘనలపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. ఈ సందర్భంగా పారాలీగల్ వలంటీర్లకు వివిధ న్యాయపరమైన అంశాలపై న్యాయవాదుల చేత శిక్షణ ఇప్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి చర్లపల్లి జైలు, చంచల్‌గూడ జైలు, చంచల్‌గూడ మహిళా జైలు నుంచి ఖైదీలను పారాలీగల్ వలంటీర్స్‌గా ఎంపిక చేశారు. ఆ ఖైదీలకు వర్చ్యువల్‌గా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, న్యాయవాదులు రవి, రోజారమణి, విజయేంద్రవర్మ, రాథోడ్, సోషల్ వర్కర్లు శ్యామలదేవి, అమితరాణి, కుటుంబ చట్టాలు, సీనియర్ సిటిజన్స్ చట్టం, పోక్సో చట్టం, ఆస్తిచట్టాలు, కార్మిక చట్టాలపై పారాలీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు.

సర్వేలో తప్పులు దొర్లకుండా వివరాలు నమోదు చేయండి

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- తట్టిఅన్నారంలో ఇందిరమ్మ సర్వే పరిశీలన


ఇందిరమ్మ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ సర్వేలో తప్పులు దొర్లకుండా వివరాలు నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సర్వేయర్లకు సూచించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం 13వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వేను గురువారం సాయంత్రం అదనపు కలెక్టర్‌తో పాటు హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్(ఐఏఎస్) పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే వివరాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించారు. వివరాల నమోదు సమయంలో సర్వేయర్లు జాగ్రత్త వహించాలని సూచించారు. దరఖాస్తుదారులు ఇచ్చిన పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. గడువులోగా సర్వే పూర్తి చేయాలని చెప్పారు. సర్వే తీరును అధికారులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు ఎన్‌హెచ్ఏఐకి ప్రతిపాదనలు

- కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానం



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారిపై రెండు చోట్లా ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ ఎన్‌హెచ్ఏఐకి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానంతో కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీ అధ్యక్షతన తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 25 ఎజెండా అంశాలపై చర్చించిన కౌన్సిల్ అనంతరం వాటికి ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పెద్దఅంబర్‌పేట్‌లో విజయవాడ జాతీయ రహదారిపై పసుమాముల రోడ్డు, లక్ష్మారెడ్డిపాలెం వద్ద రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను చేపట్టాలని జాతీయ రహదారుల అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అందుకు అవసరమైన తీర్మానాన్ని కూడా చేసినట్లు చెప్పారు. పెద్దఅంబర్‌పేట్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణరెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పోరాటాల చరిత్ర కమ్యూనిస్టులకే దక్కింది : రవీంద్రచారి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న రవీంద్రచారి, యాదిరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమంలో పోరాటాల చరిత్ర కమ్యూనిస్టులకే దక్కిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. గురువారం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3లో సీపీఐ 100 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆత్మ బలిదానాలతో పాటు జైలు జీవితాలు గడిపిన చరిత్ర సీపీఐకే ఉందన్నారు. జమిలీ ఎన్నికల బిల్లు తీసుకువచ్చి బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 26న పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ప్రసాద్, నర్సింహ, పుల్లయ్య, నర్సింహ, నిరంజన్, యాదగిరి, నారాయణరెడ్డి, మధు, వినోద్, వీరేష్, సైదులు, నవనీత, దేవమ్మ, సావిత్రి, నరేష్, భాను పాల్గొన్నారు.

హిందూ - ముస్లిం సమైక్యతా ర్యాలీ


హిందూ-ముస్లిం సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాఖ్, బిస్మిల్‌ల వర్ధంతిని ఎల్బీనగర్‌లోని చంద్రపురికాలనీలో గల ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ భవనంలో గల జైభారత్ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ జయహో సమ్మేళనం పేరిట జైభారత్ ఉద్యమం, జయహోల సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఖదిజ్తాసి రమణమూర్తి, జయహో జాతీయ అధ్యక్షుడు విజయశంకర స్వామిలు విచ్చేసి మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న హిందూ-ముస్లిం ఐక్యతా కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం జైభారత్ కార్యాలయం నుంచి ఎల్బీనగర్ రింగురోడ్డు వరకు హిందూ-ముస్లింలు సమైక్యతా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శులు లోకనాథ్, రజనీ, ఉపాధ్యక్షులు వంశీ, వెంకన్న, ముస్లిం రెవల్యూషన్ ఫోరం కన్వీనర్ సలీం, జయహో జాతీయ నాయకులు మల్లికా వల్లభ, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మేశ్వర్, రాజు, లావణ్య, ఉమ, లక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చంపాపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయ సలహాలతో పాటు భవిష్యత్‌లో తగాదాలు రాకుండా ఉండడానికి ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి.చంద్రకుమార్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని హస్తినాపురం సెంట్రల్ కమ్యూనిటీహాల్‌లో గురువారం ఫ్యామిలి కౌన్సిలింగ్ సెంటర్, ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని చంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోమాకుల సూరిబాబు, కొండారెడ్డి, ఆనందరావు, కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పమాలధారణ విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

- ఆందోళనకు దిగిన అయ్యప్పస్వాములు

దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారణ చేసుకున్న సాగర్ అనే విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయుడు చితకబాదడంతో అయ్యప్పస్వాములు, విద్యార్థి కుటుంబ సభ్యులు గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో నారాయణ పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. వారికి మద్దతుగా బీజేపీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, అయ్యప్పసేవా సమితి ప్రతినిధులు, రాష్ట్రీయ వానర సేవ ప్రతినిధులు పాఠశాల ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన సాగర్ అన్నపూర్ణకాంప్లెక్స్ వద్ద ఉన్న నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే బుధవారం సాగర్ తోటి విద్యార్థితో మాట్లాడుతుండగా ఉపాధ్యాయుడు అకారణంగా చితకబాదాడు. దీంతో సాగర్ విషయాన్ని కుటుంబ సభ్యులకు, తనతోపాటు మాలధారణ చేసుకున్న సన్నిధానం స్వాములకు వివరించాడు. దీంతో ఆగ్రహించిన అయ్యప్పస్వాములు గురువారం పాఠశాల వద్ద ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం అయ్యప్పసేవా సమితి ప్రతినిధులు, అయ్యప్పస్వాములు, రాష్ట్రీయ వానరసేన ప్రతినిధులు ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయునిపై, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని వానరసేన ప్రతినిధులు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పాఠశాల ప్రతినిధులతో చర్చించడంతో మాలధారణ చేసుకున్న సాగర్‌ను కొట్టిన ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా సరూర్‌నగర్ పోలీసులు కూడా ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేశారు. దీంతో అయ్యప్పస్వాములు ఆందోళన విరమించారు.


పోలీసు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఆపత్కాలంలో అండగా ఉంటాం : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని సీపీ సుధీర్‌బాబు అన్నారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామన్నపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ జ్ఞానశ్యాంసుందర్‌రావు, (రూ.15,94,960) అనారోగ్యంతో మరణించిన భువనగిరి ఆర్మ్‌డ్ హెడ్‌క్వార్టర్ ఎస్ఐ శ్రీనివాసులు(రూ.7,94,120) కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ డీసీపీ కె శివకుమార్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌కాలనీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి రోడ్డులోని గణేష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జనార్దన్, అధ్యక్షుడిగా విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జగన్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా హరినాథ్ ఎన్నికయ్యారు.

మాల సంఘాల నేతల అరెస్ట్

చంపాపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తెలంగాణ మాల సంఘం జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్‌తో పాటు పలువురి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్‌లో చట్టం చేసి అన్ని రాష్ట్రాలలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని సూచించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో జీ.చెన్నయ్య, నల్ల కనకరాజు, టీ.అనిల్, బీ.వెంకటేశ్వర్లు, ఎన్.సృజన, ఎం.శ్రీకాంత్, జీ.బాలస్వామి, టీ.రమేష్‌కుమార్ ఉన్నారు.

'అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి'

ఎల్బీనగర్ : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తు తెలంగాణ మాలల ఐక్యవేదిక పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా అరెస్ట్ చేసిన మాల సోదరులను బేషరతుగా విడుదల చేయాలని తెలంగాణ మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో గురువారం సరూర్‌నగర్‌లో బేర బాలకిషన్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50లక్షల మంది మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాలలకు అన్యాయం చేస్తున్నదన్నారు. మాల, మాదిగలకు పంచాయతీ పెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నదన్నారు. ఇలాంటి దుశ్చర్యలను మాల సమాజం చూస్తూ ఊరుకోదన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం అవాన్స్ ఫైనాన్స్ సర్వీసెస్, సమర్థన్ వికలాంగుల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులను అందజేశారు. వాటితో పాటు స్పోర్ట్స్ మెటీరియల్స్‌ను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థల ప్రతినిధులకు స్కూల్ హెచ్ఎం కొండల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం


స్ఫూర్తి

హయత్‌నగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పెద్దఅంబర్‌పేట్ శాంతినగర్‌లో నివాసం ఉండే దద్దనల్ల నాగమణి కూతురు స్ఫూర్తి(15) 6వ తరగతి వరకు చదువుకుని ఇంట్లో ఖాళీగా ఉంటుంది. బుధవారం తల్లితో పాటు కుటుంబ సభ్యులు కూలీ పనికి వెళ్లారు. పని ముగించుకుని కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చే సరికి స్ఫూర్తి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారించినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో గురువారం సాయంత్రం ఆరు గంటలకు తల్లి నాగమణి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి గృహిణి..


సరిత

హయత్‌నగర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. మందుల సరిత(30) హయత్‌నగర్ వీరభద్రనగర్ కాలనీ రోడ్డు నంబర్ 5లో అద్దెకు నివాసం ఉంటుంది. భర్తతో గొడవల కారణంగా తన ఇద్దరు కూతుర్లు అనన్య(5), ఆద్య(4)తో కలిసి కొంత కాలంగా ఒంటరిగా ఉంటుంది. సరిత రామోజీ ఫిల్మ్‌సిటీలో షూటింగ్ వర్క్ చేస్తుంది. ఇదిలా ఉండగా సోమవారం ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. దీంతో సరిత అక్క కొడుకు సూరారం విజయ్ తన చిన్నమ్మ కనిపించడం లేదని గురువారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


కారులో ఆత్మహత్యకు పాల్పడిన ఉమాశ్రీ

వనస్థలిపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో కారులో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజాపూర్‌లో రాజశ్రీ ఎన్‌క్లేవ్‌కు చెందిన రామకృష్ణారెడ్డి, ఉమాశ్రీ దంపతులు నివాసం ఉంటున్నారు. ఇటీవల ఉమాశ్రీకి చికెన్‌గున్యా వ్యాధి రావడంతో అనారోగ్యానికి గురైంది. దీంతో ఎంతకి ఆరోగ్యం కుదుటపడకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఉమాశ్రీ బుధవారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో తమ కారులో కూర్చోని రెండు పురుగుల మందు బాటిల్స్‌ను తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొద్ది సేపటి తర్వాత గుర్తించిన ఉమాశ్రీ సోదరుడు ఆమెను వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.